



భక్తజన సంద్రం!



అంతర్వేది భక్తజన సంద్రమైంది.. స్వామి కన్నులారా చూసేందుకు.. స్వామి వెంట నడిచేందుకు బుధవారం వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. స్వామి వెంట నడిచారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీ లక్ష్మీనర సింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి చక్ర స్నానం నిర్వహించారు. గరుడ పుష్పక వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగుతూ భక్తుల నృసింహనామ శరణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళ, కేరళ వాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. స్వామితో కలిసి పుణ్యస్నానం ఆచరించారు - వివరాలు 6లో

ఆ ఆనందం పేరు.. ఆకాశవాణి

రేడియో గుర్తుందా.. ఈ మాట అంటే చాలు 50 ఏళ్లు దాటినవారు ఎవరైనా ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌కి వెళ్లి వస్తారంతే.. ఎందుకంటే ఆ తరం వారికి రేడియోతో అంత అనుబంధం.. గతంలో అదే వినోద సాధనం.. ప్రసార మాధ్యమం.. అప్పటిలో ఎవరింట్లో చూసినా రేడియో ఉండాల్సిందే.. ఆకాశవాణి.. వార్తలు చదువుతున్నది అంటూ మొదలయ్యేది.. అది వింటూ ఆనందించాల్సిందే.. కాలం మారింది.. కాలంతోపాటు జనం మారారు.. రకరకాల ప్రసార సాధనాలు వచ్చేశాయి.. కొంతకాలం పాటు రేడియో మూలకు చేరింది.. ఇప్పుడిప్పుడే మళ్లీ రేడియోను జనం ఆదరిస్తున్నారు.. నాడు ట్యూన్ చేస్తే చాలు సమస్త సమాచారం వినిపించేది.. మరి నేడో ట్యూన్ చేస్తే సుమధుర గీతాలను ఆలపిస్తూ ఆనందం పరశింపజేస్తోంది.. అదే ఎఫ్‌ఎం రూపంలో నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం సందర్భంగా ఒకసారి రేడియో అభిమానులు పలకరిస్తే బోలెడు ముచ్చట్లు వినిపించారు.. ఒకసారి మీరూ చూడండి మరి..! - వివరాలు 6లో



పులి.. చిక్కేనా!

పులుల కేరాఫ్ పాపికొండలు

అసలు ఉభయగోదావరి జిల్లాల్లో పులులు ఎన్ని ఉన్నాయి..? పులులా అవెక్కడుంటాయి..! మన జిల్లాల్లో అసలు పులులు లేవనేది చాలామంది వాదన. ఇది నిజం కాదు.. మన జిల్లాల్లోనూ పులులు ఉన్నాయి.. ఎక్కడో తెలుసా పాపికొండల అభయారణ్యంలో.. ఆ లెక్క ఎలా అంటారా.. నాలుగేళ్లకోసారి పులుల గణన చేపడతారు.. ఉభయగోదావరి జిల్లాల్లో 2022లో చేపట్టారు.. ఒక్క రోజు రెండు రోజులు కాదండోయ్ ఏకంగా 90 రోజులపాటు లెక్కించారు.. నాడు అభయారణ్యంలో ఆరు చిరుతలు.. నాలుగు పెద్ద పులులు ట్రాప్ కెమెరాలకు చిక్కాయి.. వచ్చే ఏడాది మళ్లీ పులుల గణన చేపట్టనున్నారు.. ఎందుకంటే గతేడాది ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో అడపాదడపా జనారణ్యంలోకి పులులు వచ్చిన ఘటనలు ఉన్నాయి.. దీనిలో భాగంగా ఇప్పటినుంచే అధికారులు సన్నద్ధమవుతున్నారు.. అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో గోదావరికి ఇరువైపులా విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంఖ్యను లెక్కించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది మే నుంచి సర్వే చేపట్టాల్సి ఉండడంతో సన్నద్ధమవుతున్నారు. ఏటా నాలుగేళ్లకోసారి జాతీయ పులుల సంరక్షణ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఆదేశాల మేరకు అటవీశాఖ పాపికొండల్లో 90 రోజుల పాటు పులుల లెక్కింపు నిర్వహిస్తుంది. చివరిగా 2022లో సర్వే జరిగింది. నాలుగేళ్లు పూర్తవడంతో వచ్చే ఏడాది మేలో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నారు. గతంతో పోల్చితే ఈసారి పాపికొండల్లో పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పాపికొండలే ఆవాసం..

పులులు,చిరుత పులులకు పాపికొండల అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని ఏజెన్సీ కలిపి మొత్తం 2.60 లక్షల ఎకరాల్లో పాపికొండలు విస్తరించి ఉన్నాయి. దూరంలో చెప్పాలంటే మొత్తం 391 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్నాయి. పాపికొండల మధ్యలో గోదావరి నది ఉంది. అందుకే పులుల రక్షణ ప్రాంతంగా పాపికొండలు ప్రసిద్ధి చెందాయి. దట్టమైన అటవీప్రాంతం కావడంతో ఇక్కడ అనేక రకాల పక్షులు, జంతువులు సంచరిస్తుంటాయి. దీంతో ఆహారం, నీటికి ఏ మాత్రం పులులకు ఢోకా ఉండదు. ఈనేపథ్యంలో పులుల ఆవాస ప్రాంతంగా ప్రసిద్ధి కెక్కింది.

చివరిగా 2022లో సర్వే

పాపికొండల్లో పులులు, చిరుతలు ఎన్ని ఉన్నాయి? అనే దానిపై రాజమహేంద్రవరం అటవీ శాఖ అధికారులు రంపచోడవరం, కాకినాడ అటవీ శాఖల సాయంతో నాలుగేళ్లకోసారి పులుల లెక్కింపు చేపడతాయి. చివరిగా పాపికొండల్లో 2022లో పులుల లెక్కింపు జరిగింది. అప్పట్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యం పరిధిలో 45 రోజులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభయారణ్యం పరిధిలో 45 రోజులపాటు సర్వే చేశారు. రెండు దశల్లో కలిపి అభయారణ్యంలోని 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పులుల సంఖ్య లెక్కించారు. నాలుగు పెద్దపులులు, ఆరు చిరుత పులులు గుర్తించారు. అయితే ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మాత్రం ఇంకో 12 వరకు ఉండొచ్చని అంచనా వేశారు. రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లోను పులులకంటే చిరుతల సంచారం అధికంగా ఉందని నిర్ధారించారు. 2018లో నిర్వహించిన సర్వేలో అసలు ట్రాప్ కెమెరాలకు పులులు, చిరుతలు చిక్కలేదు. దీంతో ఆ ఏడాది సర్వే వివరాలు బయటపెట్టలేదు.

- వచ్చే ఏడాదే పులుల గణన
- మే నెలలో లెక్కింపు
- 200కిపైగా సీసీ కెమెరాలు
- శ్రీశైలం నుంచీ నిపుణులు
- పులులు పెరిగే అవకాశం
- 12 ఉండొచ్చని అంచనా
- చివరిగా 2022లో సర్వే
- 6 చిరుతలు,4 పులులు గుర్తింపు
- 90 రోజుల పాటు సర్వే
- రంగంలోకి ఎన్‌టీసీఏ

ఈసారి పెరగడం ఖాయమే..

వచ్చే ఏడాది మేలో చేపట్టనున్న సర్వేకు సంబంధించి త్వరలో సన్నాహాలు ప్రారంభించడానికి అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈసారి మరింత పగడ్బందీగా పులుల లెక్క తేల్చాలని భావిస్తోంది.ఈ మేరకు అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. వాస్తవానికి పలుసార్లు సర్వే కోసం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా అవి చిక్కడం లేదు. దీనివల్ల వాస్తవ సంఖ్య తేలడం లేదు. మే నెలలో చేపట్టనున్న సర్వే సమయానికి అడవుల్లో చెట్ల ఆకులు రాలిపోయి కెమెరాలు బిగించడం కొంత సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. అటు ట్రాప్ కెమెరాలో వీడియోలు సైతం రికార్డవడానికి అనువుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాంతం నుంచి నిపుణులను రప్పించనున్నారు. ఈ దఫా సర్వేలో పాపికొండల అభయారణ్యంలో పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. గడచిన నాలుగేళ్లలో వీటి సంతానం కూడా బాగా వృద్ధి చెంది ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంచారం బాగా పెరిగిందని అటవీశాఖ అంచనా వేసింది. ప్రధానంగా రంప అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుతలు 12 వరకు ఉంటాయని చెబుతున్నారు.

గతేడాది ఇలా..

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యం నుంచి గతేడాది దారి తప్పి పులులు జనావాసాల్లోకి వచ్చేసిన సంఘటనలను గుర్తు చేస్తున్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఏలూరు జిల్లా పరిధిలోకి ఓ మగ పులి పాపికొండల అభయారణ్యం నుంచి వచ్చింది. అక్టోబరులో ప్రత్తిపాడులో పులి సంచారం ఆనవాళ్లు బయటపడ్డాయి. 2022 మేలో ఓ పులి ఏజెన్సీ మీదుగా ప్రత్తిపాడు, శంఖవరం, తుని రూరల్ మీదుగా వెళ్లింది. ప్రత్తిపాడులో బోనులోకి చిక్కినట్లే చిక్కి తప్పించుకుంది. గతేడాది సెప్టెంబరులో రాజమహేంద్రవరం నగరంలోకి చిరుత పులి దారితప్పి వచ్చేసింది. ఇది పాపికొండల అభయారణ్యం నుంచే వచ్చిందని గుర్తించారు.అప్పట్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు అడవుల్లో పులులు, చిరుతల స్థావరాలు చెల్లాచెదురయ్యాయి. దీంతో కొత్త స్థావరం కోసం వెదికే క్రమంలో చిరుత గోదావరి ఈదుకుంటూ రాజమహేంద్రరంలోకి వచ్చి ఉండొచ్చని అప్పట్లో అంచనా వేశారు. పాపికొండల అభయారణ్యం విస్తరించిన ఏజెన్సీ ప్రాంతం లోను వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోకవరం మీదుగా చిరుత రాజమహేంద్రవరంలోకి దారితప్పి వచ్చి ఉండొచ్చని భావించారు. ప్రధానంగా ఈ తరహా సంఘటనలు 2022 నుంచి 2024 మధ్య ఎక్కువగా జరిగాయి. పాపికొండల అభయారణ్యంలో పెరిగిన పులుల సంచారానికి ఈ ఘటనలు నిదర్శనంగా భావించొచ్చని అధికారులు విశ్లేషిస్తున్నారు. వచ్చే ఏడాది మే తర్వాత ఈ లెక్కకు సంబంధించి దాదాపు స్పష్టత రావొచ్చని చెబుతున్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

- మండలి ఎన్నికలకు సన్నాహాలు
- ఈనెల 27వ తేదీన పోలింగ్
- రేపు సిబ్బందికి శిక్షణా కార్యక్రమం
- జిల్లాలో 98 పోలింగ్ కేంద్రాలు
- 70,343 మంది ఓటర్లు
- ఎన్నికల బరిలో మొత్తం 43 మంది

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 70,343 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా, 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికోసం ఒక్కొక్క పోలింగ్ కేంద్రంల్లో రెండు బ్యాలెట్ పెట్టెలు కేటాయిస్తున్నారు. ఈనెల 14వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బందికి పోలింగ్‌పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డీఆర్వో వెంకట్రావు పర్యవేక్షణలో శిక్షణా కార్యక్రమం జరగనుంది. పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ కేంద్రం సమర్థంగా నిర్వహించే విధానాలను వివరిస్తారు. ఓటు ఎలా వేస్తే చెల్లుబాటు అవుతుందో తెలియజేస్తారు. గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో అనుసరించిన విధానాలపై చర్చిస్తారు. ఈ పర్యాయం ఉపాధ్యాయుల పోలింగ్ విధులకు దూరంగా ఉంటున్నారు. ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల విధుల నుంచి వార్ని దూరంగా పెట్టారు. కాకినాడ జిల్లాలో ఉన్న ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా పోలింగ్ ప్రక్రియను వీక్షిస్తారు. తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో ఆరు జిల్లాలు ఉండగా కాకినాడ జిల్లాలోనే అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 70,540 మంది కాగా, దీనిలో 42,463 మంది పురుషులు, 28072 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు అయిదుగురు ఉన్నారు. జిల్లాలో 625 మంది సిబ్బందిని నియమించగా దీనిలో పీవోలు 125, ఏపీవోలు 125, ఓపీవోలు 250, సూక్ష్మ పరిశీలకులు 125 మంది ఉన్నారు.

బరిలో 43 మంది అభ్యర్థులు

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పుడు 43మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2019లో 46మంది ఎన్నికల బరిలో నిలిచారు. అప్పట్లో పీడీఎఫ్ అభ్యర్థి ఇళ్ల వెంకటేశ్వరరావు, ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డిల మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. ఇళ్ల వెంకటేశ్వరరావుకు 98,193 ఓట్లురాగా అప్పట్లో ఎమ్మెల్సీగా గెలుపొందారు. ప్రధాన ప్రత్యర్థి నల్లమిల్లి శేషారెడ్డికి కేవలం 38,124 ఓట్లు మాత్రమే నమోదు అయ్యాయి. ఇదిలా ఉండగా ఈసారి 43 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కూటమి ప్రభుత్వం తరపున పేరాబత్తుల రాజశేఖరం బరిలో నిలిచారు. పీడీఎఫ్ తరపున దిడ్ల వీరరాఘవులు ఎన్నికల బరిలో ఉన్నారు. వైసీపీ ఎన్నికలకు దూరంగా ఉంది. తెలుగు నవగర్జన పార్టీ నుంచి కాట్రు నాగబాబు, రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి షేక్ హుస్సేన్ బరిలో ఉన్నారు. మిగిలిన అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల్లో ఉన్నారు.

తొలిరోజు ఉపసంహరణ నిల్.. నేటితో ముగుస్తున్న ఎమ్మెల్సీ ఉపసంహరణలు
ఎమ్మెల్సీ ఎన్నికలు పరిశీలకురాలిగా సునీత.. రెండ్రోజుల్లో సమీక్ష 7

అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోవాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రవాణా, నిర్మాణం తదితర శ్రామిక రంగాల్లో పనిచేసే అసంఘటిత కార్మికులందరూ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో రిక్షా, ఆటో, ట్యాక్సీ, లారీ వాహన రవాణా, ఇటుక బట్టీలు, కార్పెంటరీ, భవన నిర్మాణం తదితర రంగాల కార్మిక సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయడం ద్వారా సామాజిక భద్రతతోపాటు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ కార్మిక సంక్షేమ పథకాలు పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్ నమోదైన ప్రతి కార్మికుడికి ఒక సంవత్సరం పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉచితంగా పొందవచ్చనన్నారు. జిల్లాలో సుమారు 6 లక్షల మంది కార్మికులు అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్నారన్నారు. ఈ పథకంలో చేరేందుకు 16 నుంచి 59 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. ఆదాయపు పన్ను చెల్లించనివారు, ఎంప్లాయిస్ ప్రొవిడెంట్ ఫండ్, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్సు సదుపాయం లేనివారు అర్హులన్నారు. వ్యవసాయ అనుబంధ ఉపాధులు, చిన్న సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, నర్సరీలు, ఉద్యానవనాలు పనివారు, పాడి పరిశ్రమ, ఉమ్మడి వ్యవసాయదారులు తదితర అసంఘటిత రంగంలోపనిచేసే ప్రతీ ఒక్కరూ అర్హులన్నారు. ఈ-శ్రమ్‌పోర్టల్ నమోదుకు అవసరమైన సమాచారంతో దగ్గరలో గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చని, తమ మొబైల్‌ఫోన్ ద్వారా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఈశ్రమ్. జీవోవీ.ఇన్ వైబ్సైటులో వివరాలునమోదు చేసుకోవచ్చన్నారు. మార్చి 31వ తేదీలోపు నమోదు చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ భావన, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ బులిరాణి, పశుసంవర్థక శాఖ జేడీ సూర్యప్రకాశరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, చేనేత శాఖ ఏడీ పెద్దిరాజు, జిల్లా ఎక్సైజ్ అధికారి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు దామోదరం సంజీవయ్య జయంతి

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఈనెల 14వ తేదీ కాకినాడ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. నిరుపేద, దళిత కుటుంబంలో జన్మించిన దామోదరం సంజీవయ్య నిరాడంబరత, నిజాయితీ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు.

పది, ఇంటర్ పరీక్షలకు తగిన ఏర్పాట్లు : డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలో సజావుగా జరిగేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో రెగ్యులర్ పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలతోపాటు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్య, ఓపెన్ స్కూల్ సొసైటీ, జిల్లా పరిషత్, పోలీస్, రవాణా, విద్యుత్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 142 పరీక్ష కేంద్రాల్లో 28,963 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ప్రశ్నాపత్రాలు స్టోరేజ్ నిమిత్తం 25 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే మార్చి 17 నుంచి 28వరకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పదోతరగతి పరీక్షలు, మార్చి 3 నుంచి 15 వరకు ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయన్నారు. రెగ్యులర్ పదోతరగతి పరీక్షలతోపాటు ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం పూట నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 8873 మంది విద్యార్థులకు 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. స్టోరేజ్ కేంద్రాల నుంచి పరీక్ష పత్రాలను సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేర్చడం దగ్గర నుంచి జవాబు పత్రాలను తిరిగి పోస్టాఫీస్‌కు పంపేవరకు ప్రతి విషయంలోనూ వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, డీఈవో రమేష్, డిప్యూటీ జెడ్పీ సీఈవో రామ్మోహన్, డీటీసీ శ్రీధర్, పోస్టల్ పీఆర్‌ఐపీ ప్రసాదరావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకట్రావు

యానిమేటర్ రూ.కోటితో పరార్..

కలెక్టరేట్ ఎదుట డ్వాక్రా సభ్యుల ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం పి. వెంకటాపురంలో డ్వాక్రా యానిమేటర్ కనకలక్ష్మి గ్రూపు సభ్యులకు తెలియకుండా కోటి రూపాయలు బ్యాంకు నుంచి తీసుకెళ్లిందని, న్యాయం చేయాలని కాకినాడ కలెక్టరేట్ ఎదుట ఆ గ్రామం గ్రూపు సభ్యులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. యానిమేటర్ తిమ్మాపురం యాని యస్ బ్యాంకు నుంచి ఈ సొమ్ము తీసుకెళ్లినట్టు కలెక్టర్ దృష్టికి వారు తీసుకెళ్లారు.

ఉప్పాడ బీచ్‌లో సముద్ర స్నానాలు



మాఘపౌర్ణమి స్నానాలకు పోటెత్తిన భక్తులు

7

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా దాడిశెట్టి రాజా

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఈ నియామకాన్ని ప్రకటించింది. ఇప్పటివరకు ఈ స్థానంలో ఉన్న మాజీ మంత్రి కురసాల కన్నబాబును ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమించారు.

బర్డ్‌ఫ్లూ.. ముందస్తు చర్యలు తప్పనిసరి - డీఎంహెచ్‌వో

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తిచెందుతున్న నేపథ్యంలో ప్రజలు, మూగజీవాలు ఈ వ్యాధికి గురికాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహానాయక్ అన్నారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కొన్ని సలహాలు, సూచనలు చేశారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకితే తగు జాగ్రత్తలు పాటించడం ముఖ్యమన్నారు. వైరస్‌వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. ముఖ్యంగా వైద్యసిబ్బంది తమ రోజువారీ సర్వేలో భాగంగా బర్డ్‌ఫ్లూ వైరస్ గురించి తెలియజేసి ఆరోగ్య సూత్రాలు వివరించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చికెన్ తినడం తప్పని సరైతే చికెన్ పూర్తిగా 75 డిగ్రీల సెంటిగ్రేడ్‌కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో ఉడికించి మాత్రమే తినాలన్నారు. పచ్చిమాంసం కాని, సగం ఉడకబెట్టిన కోడి గుడ్డును తినకూడదన్నారు. మాంసాన్ని ఉడకబెట్టిన తరువాత మాత్రమే కడగాలని, ఆ తర్వాతే వండాలన్నారు.



రీ సర్వేలో సందేహాలకు సంప్రదించాలి జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో వచ్చిన సందేహాల నివృత్తికి డీఎస్‌ఎల్‌వో కార్యాలయంలో ఇద్దరు సర్వేయర్లను నియమించామని జేసీ రాహుల్‌మీనా తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పీవీవీ రమణ (8019216363), లేదా జే హేమంత్ (80196 16363)లను సంప్రదించాలన్నారు. భూయజమానులు, ఫీల్డ్ సిబ్బంది రీసర్వేలో సందేహాలకు సంప్రదించాలన్నారు.

నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం


ఆ ఆనందం పేరు 'ఆకాశవాణి..


రేడియోలో పాటలు వింటున్న డాక్టర్ విజయారెడ్డి

బుల్లి పెట్టెలో బూచోడు..

బూచాడమ్మా బూచాడు.. బుల్లెపెట్టెలో ఉన్నాడు.. కళ్లకెప్పుడూ కనబడడు.. కబుర్లెన్నో చెబుతాడు అంటూ రేడియోలో పాట విని ఎంతో కాలమవుతుంది. సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా పెరిగి సెల్‌ఫోన్లు, టీవీలు రావడంతో రేడియోలన్నీ మూలకు చేరిపోయాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కూడా రేడియోలో వార్తలు వింటూ సిలోన్ నుంచి వచ్చే పాటల కోసం ఎదురుచూస్తున్నారంటే ఆశ్చర్యమే మరి.

అమలాపురం పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డికి రేడియో అంటే ప్రాణం. అమలాపురంలోని ఫిలిప్స్ షోరూంలో 1997లో కొనుగోలు చేసిన రేడియోనే నేటికీ ఆయన వినియోగిస్తున్నారు. మండల పశువైద్యాధికారిగా పనిచేసే సమయంలో 27 ఏళ్ల కిందట ఆయన ఈ రేడియోను కొనుగోలు చేశారు. ఎప్పుడైనా ఆ రేడియో పాడైతే వెంటనే బాగు చేయించుకుని వచ్చి వినియోగిస్తూ ఉంటారు. సెల్‌ఫోన్ కంటే రేడియో ఉత్తమమని చెబుతారాయన. శ్రోతలు కోరిన ఎన్నో మంచి మంచి పాటలు వినడంతో పాటు సత్యమైన ఆకాశవాణి వార్తలు వింటూ ఉంటానన్నారు. ఆ పాత మధురమైన పాత పాటలు రేడియోలో వింటే ఆ ఆనందమే వేరంటున్నారు. మూడు పెద్ద సైజు నిప్పో బ్యాటరీలతో పనిచేసే ఆ రేడియో పట్టణ ప్రాంతాలకంటే గ్రామీణ ప్రాంతాల్లో బాగా పనిచేస్తుందని, పల్లె ప్రాంతాల్లో విధులకు వెళ్లినప్పుడు ఖాళీ దొరికితే ఆ రేడియో తనకు మంచి నేస్తంగా మారిపోతుందని చెప్పారు. - అమలాపురం టౌన్



ఆ ఇల్లే.. ఓ రేడియో..



నిద్ర లేవగానే రేడియో ఆన్‌చేసే రోజులవి. కరెంటుతో సంబంధం లేకుండా బ్యాటరీలే ఆధారంగా రేడియోలు పనిచేసే రోజులవి. పల్లె, పట్టణమన్న బేధం లేకుండా ప్రజలకు 1960, 1970 దశకాల్లో రేడియో అతిపెద్ద వినోద సాధనం. వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా యథార్థమైన వార్తలను ప్రసారం చేస్తూ ప్రజలందరినీ పాటలతో పరవశింపచేసిన రోజులవి. ఆ రోజుల్లోనే అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో రావూస్ రేడియో సర్వీస్ సెంటర్‌ను రావూస్ నాగేశ్వరరావు 1970వ దశకంలో ప్రారంభించారు. ఫిలిప్స్ రేడియో ఆథరైజ్డ్ డీలర్ షిప్‌ను దక్కించుకున్నారాయన. రేడియో మెకానిక్‌గా పేరొందిన నాగేశ్వరరావు గడియారస్తంభం సెంటర్‌లోని తన ఇంటిని ఫిలిప్స్ రేడియో ఆకారంలో డిజైన్ చేయించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు క్షణం తీరిక లేకుండా రేడియోలు విక్రయించారాయన. ఎక్కెడెక్కడో సుదూర ప్రాంతాల నుంచి సైతం వచ్చినవారు రావూస్ నాగేశ్వరరావు రేడియో షాపులో రేడియోలు కొనుగోలు చేసేవారని నాటితరం వారు నేటికీ చెబుతున్నారు. 1980వ దశకంలో టేప్‌రికార్డర్లు రావడంతో రేడియోల వినియోగం తగ్గింది. కాలక్రమంలో సీడీ ప్లేయర్లు, ఇతర వినోద సాధనాలు అందుబాటులోకి రావడంతో క్రమక్రమంగా వ్యాపారం సన్నగిల్లింది.

- అమలాపురం టౌన్

రేడియో.. ఓ చరిత్ర



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో నలుదిక్కుల సమాచారాన్ని చేరవేసే తొలి ప్రసార సాధనంగా రేడియో చరిత్ర సృష్టించింది. ప్రపంచ సమాచార వ్యవస్థ గతినే రేడియో మార్చేసింది. గాలి, ధ్వని తరంగాల ద్వారా సమాచారాన్ని క్షణాల్లో విశ్వాన్ని చుట్టేదే రేడియో. నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం. రేడియోను మానవాళికి కానుకగా ఇచ్చినవాడు మార్కోని. మార్కోనికి ముందు పద్దెనిమిదవ శతాబ్దంలో రేడియో సాంకేతికతకు కొంత ప్రయత్నం జరిగింది. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన జేమ్స్ మాక్స్ వెల్, జర్మనీకి చెందిన హెర్జ్, కాథలిక్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎడ్వర్డ్ బ్రాన్లీ రేడియో సాంకేతికతకు పునాదులు వేశారు. ఆ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని 1896లో రేడియోకి ఒక రూపాన్ని ఇచ్చాడు మార్కోని. అయితే దాని ప్రసార పరిధి రెండు కిలోమీటర్ల దూరానికే పరిమితమైంది. 1907లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన జాతీయ గీతాన్ని ఒక ఓడ నుంచి మరో ఓడకి ప్రసారం చేయడంలో రేడియో ముందడుగు వేసింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధ నౌకకు వైర్‌లెస్ ద్వారా మార్కోని సందేశం పంపించాడు. ఇలా రేడియో విశ్వవేదిక మీదుకు అడుగుపెట్టింది. మన దేశంలో రేడియో ప్రసారం 1923 జూన్ నెలలో జరిగింది. బొంబాయి రేడియో క్లబ్ దానికి నేతృత్వం వహించింది. ఆ తర్వాత బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ ఆధ్వర్యంలో 1927లో కలకత్తా, బొంబాయి నగరాల్లో రేడియో ప్రసారాలు అందుబాటులోకి వచ్చాయి. 1936లో ఆకాశవాణి ప్రభుత్వ సంస్థగా అవతరించింది. ఆ తర్వాత మద్రాసు కేంద్రంగాను, అటుపై విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రాల నుంచి రేడియో ప్రసారాలు జరిగేవి. ప్రతి ఇంట్లోను, షాపులోను, టీ దుకాణాల్లోను, హోటళ్లలోను ఇప్పుడు ఎల్‌సీడీ టీవీల మాదిరిగా రేడియోలు అప్పట్లో కనిపించేవి. 1946లో స్వాతంత్రోద్యమ సమయంలో రేడియో అత్యంత కీలక పాత్ర పోషించింది. రేడియో భారతదేశంలోకి ప్రవేశించి ఇప్పటికి 102 ఏళ్లు.

ప్రకృతి విపత్తుల్లో నమ్మకమైన నేస్తం..

ఉభయ గోదావరి జిల్లాల్లో తరచు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి. అలాంటి సమయంలో రేడియో గొప్ప నేస్తంగా నిలిచేది. విశాఖ ఆకాశవాణి నుంచి మనకు ప్రసారాలు వస్తుంటాయి. 1986లో గోదావరి జిల్లాల్లో వరద బీభత్సం సృష్టించినప్పుడు విశాఖ ఆకాశవాణి వరదల సమాచారం, అప్రమత్తత గురించి వందలాది బులిటెన్లు అందించింది. 1996లో తుఫానుకు కోనసీమ కకావికలమైనప్పుడు కూడా అక్కడి నుంచే సమాచార ప్రసారాలను అందించింది. ఈ సమయానికి టీవీ ఛానళ్ల ప్రభావం పెరిగినప్పటికీ విద్యుత్ సరఫరాతో సమాచారం అందే పరిస్థితి లేదు. విశాఖ మీడియం వేవ్‌తోపాటు విశాఖ ఎఫ్ఎం కూడా విశేషమైన సేవలందించింది.


ప్రసారాలను వింటున్న నాగేశ్వరరావు

పాతకాలం వస్తువైపోయింది..

రేడియో ఓ పాతకాలం నాటి వస్తువైపోయింది. కానీ ఇప్పటికీ ఆయనకు రేడియోనే ప్రధాన ప్రసార సాధనం. పేరు వజ్రపు నాగేశ్వరరావు. సామర్లకోటలోని సంపెంగతోటకు చెందిన ఈయన సంపెంగపూల వ్యాపారి. ఇంటి వద్ద నిత్యం రేడియోతోనే కాలక్షేపం చేస్తాడు. ఇప్పటికీ వార్తలతోపాటు పాటలు, కాలక్షేపం కబుర్లు వింటూ ఉంటాడు. అటుగా పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులు అతడి రేడియో కాలక్షేపాన్ని ఆసక్తిగా గమనిస్తుంటారు. గత నలభై ఏళ్లుగా రేడియో వింటున్నానని ఆయన చెప్పాడు. తన రేడియోలో వాడే బ్యాటరీల కోసం నెలకు రూ.100 వరకూ ఖర్చుపెడతానని చెప్పాడు.

- సామర్లకోట



మదిలో మెదులుతున్నాయి..

ఆధునిక టెక్నాలజీతో ఎఫ్ఎం రేడియో తరం వచ్చినా నా చిన్ననాటి ఆకాశవాణి ప్రసారాలే నేటికీ మదిలో మెదులుతున్నాయి. మా చిన్నాన్న గారు ఇంట్లో మార్ఫి రేడియో ఉండేది. మాపిన్ని శకుంతలకు ఉదయం భక్తిరంజని అంటే చాలాఇష్టం. అందులో ఎస్పీ బాలు భద్రాచల రామదాసు కీర్తనలు, ఎమ్మెస్ రామారావు హనుమాన్ చాలీసా ఎక్కువగా వినేవాళ్లం. 1984లో నేను డిగ్రీ చదివే రోజుల్లో ఎక్కువగా ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రసారం చేసే యువవాణి వినేవాడిని. డీఎస్ఆర్ ఆంజనేయులు చాలా చక్కటి కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేసేవారు. నేను ఆకాశవాణి విజయవాడ కేంద్రం ఉభయకుశలోపరి కార్యక్రమానికి ఉత్తరాలు రాసేవాడిని. శ్రోతల అభిప్రాయాలను రేడియోలో తెలియజెప్పేటప్పుడు నా పేరు రేడియోలో వినేందుకు మా కుటుంబ సభ్యులంతా ఆత్రుతగా ఎదురుచూసి పేరు చదవగానే ఆనందపడేవాళ్లం.

పరస జగన్నాథరావు, ఉపాధ్యాయుడు, రాజమహేంద్రవరం

- రాజమహేంద్రవరం సిటీ

నేడు ఎఫ్ఎంకు ప్రాధాన్యం



రేడియో ఆకాశవాణికి గతంలో చాలా ప్రాధాన్యం ఉండేది. క్రమేపీ ఆధునిక యుగంలో రేడియోలో కొత్త చానల్స్ ప్రవేశించాయి. అప్పుడు ఆకాశవాణి ఉంటే, ఇప్పుడు ఎఫ్ఎం రేడియో ప్రవేశించింది. చాలామంది తమ సెల్‌ఫోన్లలో, కార్లు, ఆటోలు, బస్సుల్లో ఎఫ్ఎమ్ రేడియోలను వినియోగించి సినిమా పాటలు, హాస్య సంభాషణలుతో ఆనందం పొందుతున్నారు.

ప్రధాని మన్‌కీ బాత్‌తో..

ఇప్పటికీ రేడియో ప్రత్యామ్నాయ నిరంతర ప్రసార సాధనంగానే ఉంది. విద్యుత్‌తో పనిలేకుండా పనిచేసే మీడియం. మారుమూల కుగ్రామాలకు సైతం రేడియో ప్రసారాలు వినిపించగలవు. అందుకే ప్రధాని మోదీ రేడియోను ఒక శక్తివంతమైన ప్రసార సాధనంగానే వినియోగిస్తున్నారు. మన్‌కీ బాత్ (మనసులో మాట) పేరుతో ప్రతి నెల ప్రజల ముందుకు వస్తున్నారు. కుగ్రామాల్లో, కొండల్లో, గుట్టల్లో తన వాణిని వినిపించేలా మోదీ అద్భుతంగా రేడియోని వినియోగించుకోవడం విశేషం.

బావగారి కబుర్లు గుర్తున్నాయా..!

ఉదయాన్నే భక్తిరంజని వింటూ ఇంటి పనులు కానిచ్చేవారు. భక్తిరంజనిలో ఆరోజుకు అనుగుణంగా భక్తి కార్యక్రమాలు ప్రసారమయ్యేవి. శనివారం వెంకటేశ్వర సుప్రభాతం, ఆదివారం ఆదిత్య హృదయం, సోమవారం శివస్తోత్రం.. ఉదయం అర్ధగంటపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆకాశవాణి శ్రోతలను రంజింపజేసేది. ఉదయం 7 గంటలకు తెలుగులో వార్తలు, 8 గంటలకు ఆంగ్లంలో, అనంతరం హిందీలో వార్తలు. తెలుగు వార్తలంటే తిరుమలశెట్టి శ్రీరాములు గుర్తుకు రాకమానరు. 'ఈ ఎన్నికల్లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఓడిపొయ్యారు(ఓడిపోయారు).' ఎన్నికల వార్తలు చదవడంలో ఆయన భాషలోని యాస అందరినీ ఆకట్టుకునేది. ఇక మధ్యాహ్నం కార్మికుల కార్యక్రమంలో కార్మికుల కోసం పలు కార్యక్రమాలు. అనంతరం బావగారి కబుర్లు. ఈ కబుర్లలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు వివిధ అంశాలపై శ్రోతలకు అర్థమయ్యేలా బావగార్లు మాట్లాడుకోవడం శ్రవణానందంగా ఉండేది. వనితావాణి, మహిళా మండలి కార్యక్రమాలు అతివలను ఎంతగానో ఆకట్టుకుంటూ కొనసాగేవి. చిత్రసీమ, శ్రోతలు కోరిన పాటలు, చిత్రరంజని సినిమాగీతాల కార్యక్రమాలకు రేడియోల వద్ద చిన్నల నుంచి పెద్దల వరకు కాపుకాసేవారు. పాటల కోసం ఉత్తరాలు రాసిన శ్రోతలు తమ పేరు చదవగానే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిన ఆ క్షణాలు ఎలా మరచిపోగలం. బుధవారం, శనివారం రాత్రి అరగంటసేపు ప్రసారమయ్యే నాటికల కోసం జనం ఎదురుచూసేవారు. ఆదివారాల్లో వారం విడిచి వారం ప్రసారం చేసే ఒక గంట వ్యవధి రేడియో నాటకం, ఆకాశవాణి సంక్షిప్త శబ్దచిత్రాల కోసం పడిగాపులు పడిన రోజులు చాలామందికి గుర్తుండే ఉంటుంది. సంగీత ప్రియులకోసం కర్ణాటక, హిందూస్థానీ సంగీత కార్యక్రమాలు, లలిత సంగీతం వంటి వివిధ కార్యక్రమాలు ఆయా వర్గాల శ్రోతల కోసం ప్రసారమయ్యేవి. చిన్నారుల కోసం బాలానందం వంటి కార్యక్రమాలను రూపొందించి రేడియో అన్నయ్య, అక్కయ్యలను జనం ఇంకా గుర్తుంచుకున్నారు. రైతుల కోసం పొలం పనులు, పాడిపంటలు ప్రసారం చెయ్యడంలో విజయవాడ, హైదరాబాదు కేంద్రాలు పోటీపడేవి. సిలోన్ (శ్రీలంక) ఆకాశవాణి కేంద్రాన్ని గుర్తుచేసుకోకపోతే ఎలాగండీ?? సాయంత్రం సిలోన్ కేంద్రం ద్వారా ప్రత్యేకంగా ప్రసారమయ్యే తెలుగు సినిమా పాటల కోసం పాటల ప్రియులు ఎదురుచూసేవారు. క్రికెట్ మ్యాచ్ లైవ్‌ను రేడియో ద్వారా విని క్రీడాభిమానులు తెగ సంబరపడేవారు. నిజానికి క్రికెట్ మ్యాచ్‌ల సమయంలో రేడియోల విక్రయాలు ఎక్కువగా జరిగేవంటే అతిశయోక్తి కాదు. ఇలా ఆకాశవాణి అన్ని వర్గాల జనానికి చేరువై దూరదర్శన్ అవతరణ అనంతరం క్రమంగా దూరం జరుగుతూ వచ్చింది.

- ఉప్పలగుప్తం

కన్నుల పండువగా చక్రస్నానం

- అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన సముద్ర తీరం
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు


గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘపౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి చక్రస్నానాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు ఆలయం వద్ద నుంచి అలంకార మండపంలో అర్చకుల పూజలందుకున్న స్వామివారిని రుద్రరాజు బంగారమ్మ బహూకరించిన గరుడ పుష్పక వాహనంపై పెట్టి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తుల నృసింహనామ శరణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళ, కేరళ వాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామికి, చక్రపెరుమాళ్ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకటశ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితులు చింతా వేంకటశాస్త్రి, పేరూరు ఉద్దండ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆర్డీవోలు శ్రీకర్, అఖిల, డీసీ రమేష్‌బాబు, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ దిరిశాల బాలాజీ, డీఎస్పీ మురళీమోహన్, పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, పోతు రాజు శ్రీవేంకటకృష్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, సీఐలు నరేష్ కుమార్, భీమరాజు, ఎస్ఐ కె. దుర్గాశ్రీనివాస్, వాహనకారులు, భక్తులు, తదితరులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సముద్ర తీర మంతా భక్తులతో కళకళలాడింది. అనంతరం ఎమ్మెల్యే కూటమి శ్రేణులు, దేవాదాయశాఖ, రెవెన్యూ అధికారులు పోలీసులు పుణ్యస్నానాలు ఆచరించారు.


ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే, ఆలయ ఛైర్మన్, ఆర్డీవోలు, డీసీ, ఏసీ

● నేడు స్వామివారి తెప్పోత్సవం

కల్యాణోత్స వాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఉదయం సుప్రభాతసేవ, తిరువారాధన, బాలభోగం, సాయంత్రం ఐదు గంటలకు అప్పనపల్లి వాస్తవ్యులు దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు వారిచే నిర్మితమైన పుష్పకవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరగనుంది. సాయంత్రం ఆరు గంటలకు చివరి ఘట్టమైన శ్రీస్వామివారి తెప్పోత్సవం ఆలయ ఉత్తర ఈశాన్యంలో ఈ ఏడాది నూతనంగా ఏర్పాటుచేసిన చెరువులో మిరుమిట్లుగొలిపే విద్యుత్ దీపాలంకరణలతో చేసిన హంసవాహనంపై బ్రహ్మాండమైన బాణసంచా కాల్పులతో వెంప వాస్తవ్యులు గొట్టుముక్కల భీమరాజు సహకారంతో తెప్పోత్సవం జరగనుంది. రాత్రి ఎనిమిది గంటలకు తిరుమంజనములు, దర్పణసేవ, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోల విన్నపం, తీర్థగోష్ఠి, శ్రీస్వామి వారి పవళింపుసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.


తీరాన్ని తాకిన భక్త జనసందోహం


సముద్ర తీరంలో చక్ర, జల్లుస్నానాలను పరిశీలిస్తున్న ఆర్డీవోలు

ఆనందోత్సాహాలతో ..

భీమేశ్వరుడి వసంతోత్సవం


కల్యాణమూర్తులపై వసంతాలు పోస్తున్న అర్చకస్వాములు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12, ఆంధ్రజ్యోతి: ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి వసంతోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం త్రిశూల, శ్రీచక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం వేగాయమ్మపేట ఆస్థాన మండపం వద్ద నుంచి కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామి వార్లను రథంపై ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం నిత్యపూజ, అర్చనలు జరిగాయి. తదుపరి మండపారాధన, నాకబలి పూజలు ఆగమ పండితులు దేవులపల్లి ఫణిరామకృష్ణ నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం వసంతోత్సవం జరిగింది. కల్యాణమూర్తులైన అమ్మవారు, స్వామి వార్లకు వసంతాలు చల్లారు.

అనంతరం అర్చక స్వాములు కల్యాణమూర్తులను చేతపట్టి వసంతాలు జల్లుకున్నారు. మంగళవాయిద్యాలకు అను గుణంగా లయబద్ధంగా నృత్యంచేస్తూ దండాడింపు, వసంతోత్సవం ఆహ్లాదంగా జరిగాయి. తదుపరి సప్తగోదావరి నదిలో త్రిశూల, శ్రీచక్రస్నానం అర్చకస్వాములు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు త్రిశూల, శ్రీచక్ర స్నానం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాప్రసాద్, అర్చకులు, సిబ్బంది, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సారె సమర్పణ: భీమేశ్వర పారాయణం చేస్తున్న మహిళలు మాణిక్యాంబ అమ్మవారికి సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, స్వీట్లు, పండ్లు , చీర, రవికె సమర్పించారు.


నృత్యం చేస్తున్న అర్చక స్వాములు

చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్ వారాంతపు ప్రత్యేక రైళ్లు



విజయవాడ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్ మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్ఓ నస్రత్ మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రద్దీని నియంత్రించేందుకు ఈ రైళ్లను ఈనెల 23వ తేదీ వరకు నడుపుతున్నట్లు తెలిపారు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ రైలు చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయలుదేరి కాకినాడ టౌన్‌కు ఉదయం 4.30 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 14, 21 తేదీలలో నడుస్తుంది. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి రైలు కాకినాడలో సాయంత్రం 6.55కు బయలుదేరుతుంది. చర్లపల్లికి ఉదయం 6.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 16, 23 తేదీలలో నడుస్తుంది. 07233 చర్లపల్లి - నరసాపూర్ రైలు రాత్రి 7.15కు చర్లపల్లిలో బయలుదేరి నరసాపూర్‌కు ఉదయం 5.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు ఈనెల 14, 21 తేదీలలో నడుస్తుంది. 07234 నరసాపూర్ - చర్లపల్లి రైలు నరసాపూర్‌లో రాత్రి 8 గంటలకు బయలుదేరి చర్లపల్లికి ఉదయం 8 గంటలకు చేరుతుంది. చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. దీనికి టూఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండతరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు. చర్లపల్లి - నరసాపూర్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్, రెండవరగతి కోచ్‌లు అనుసంధానం చేశారు.





తొండంగి సముద్రతీరంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మాఘపౌర్ణమి స్నానాలకు పోటెత్తిన భక్తులు

- సముద్రునికి హారతులు
- ఉప్పాడ, తొండంగి తీరాల్లో వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు



ఉప్పాడ రేవులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు.. ఇన్‌సెట్‌లో సముద్రుడికి నమస్కరిస్తున్న మహిళ

కొత్తపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘపౌర్ణమి సందర్భంగా బుధవారం కాకినాడ జిల్లా ఉప్పాడ రేవులోను, తొండంగి తీరంలోను పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. కరోనా తర్వాత మాఘపౌర్ణమిలో వేలాదిమంది భక్తులు స్నానాలు ఆచరించడం విశేషం. పిఠాపురంనుంచి శ్రీ కుంతీ మాధవస్వామి(దొంగదేముడు) బుధవారం తెల్లవారుజామున వేదపండితులు పల్లకిలో ఊరేగించుకుంటూ కొత్తపల్లి మండలం ఉప్పాడ రేవుకు తీసుకొచ్చి చక్రస్నానం చేయించారు. స్వామివారి చక్రస్నానం అనంతరం పిఠాపురం, కత్తిపూడి, శంఖవరం, తుని, కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది ఉప్పాడ రేవులో సముద్ర స్నానాలు చేసి ఒడ్డునే ఉన్న శ్రీకుంతీ మాధవస్వామి దర్శనం చేసుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. నాయకర్ కాలనీలో గంగాలమ్మతల్లి జాతరలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు కానుకలు సమర్పించారు. తెల్లవారుజాము 4గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉప్పాడరేవులో భక్తులు స్నానాలు ఆచరించడం విశేషం.



పౌర్ణమి పర్వదినాన రత్నగిరిపై రద్దీ

అన్నవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం సత్యదేవుని సన్నిధికి భక్తులకు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి 2గంటల సమయం పట్టింది, 40వేల మంది స్వామిని దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.35లక్షల ఆదాయం లభించింది.

తొలిరోజు ఉపసంహరణలు నిల్

- నేటితో ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణల గడువు ముగింపు

ఏలూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లను తొలి రోజు బుధవారం ఎవరూ ఉపసంహరించుకోలేదు. దీంతో ప్రస్తుతానికి 43మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈనెల 13వ తేదీ గురువారంతో ముగియనుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక బరిలో నిలిచిన అభ్యర్థులకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి గుర్తులను కేటాయించనున్నారు. పరిశీలనలో 11మంది నామినేషన్లు సక్రమంగా లేకపోవడంతో వాటిని తిరస్కరించిన విషయం తెలిసిందే.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనలో నిందితుడికి రిమాండ్

కరప,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన ఆటో డ్రైవర్‌ను అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు హాజరుపరచగా నిందితుడికి మెజిస్ట్రేట్ 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కేదాసి సూరిబాబును అదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మేడపాటి శ్రీనివాసరావు ఈనెల 9న వేళంగి-జి.బావారం రోడ్డులో వైన్‌షాప్ దగ్గర కత్తితో విచక్షణంగా దాడి చేశాడు. నిందితుడిని మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని ఎస్ఐ చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో గడ్డి మందు తాగి ఇద్దరి మృతి

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వివిధ కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై గడ్డి మందు సేవించి తీవ్ర అస్వస్థతకు గురై కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఆర్ జిల్లా గంగవరం మండలం జగ్గంపాలేనికి చెందిన వి.వీరప్రసాద్ (27) వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆ యువకుడిని గమనించిన కుటుంబీకులు తొలుత గోకవరం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామానికి చెందిన వల్లు ఏసుబాబు(54) వేరేవారి గేదె తన వల్లే చనిపోయిందని ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఏసుబాబు గేదెను చెందిన వారికి నష్టపరిహారంగా రూ.25వేలు ఇవ్వాలని స్థానిక పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఏసుబాబు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబీకులు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాకీ టోర్నమెంట్‌కు రానున్న 40 టీంలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరిగే 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో 18 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాలు, 11 ప్రాంతీయ క్రీడా మండళ్ల నుంచి 40 టీంలు పాల్గొంటున్నాయని టోర్నమెంట్ చీఫ్ కోఆర్డినేటర్, డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఇందులో 33 పురుషుల టీములు, 7 మహిళల టీములు పోటీపడనున్నాయన్నారు. మొత్తం 538మంది పురుష క్రీడాకారులు, 205 మంది మహిళా క్రీడాకారులు, వారితోపాటు 70మంది కోచ్‌లు, మేనేజర్లు ఈవెంట్‌లో పాల్గొంటున్నారన్నారు. హర్యానా, చత్తీస్‌ఘడ్, న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల తదితర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. వీరందరికీ అవసరమైన వసతి, రవాణా, ఆహార ఏర్పాట్లను చేపట్టామని తెలిపారు.

తుని బాలుడి కిడ్నాప్ కేసులో..

పాఠశాల పీఈటీయే నిందితుడు

- మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి కిడ్నాప్‌నకు పథకం
- ఈజీ మనీ కోసమే చేశారని వెల్లడించిన పోలీసులు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

తుని రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తునిలో సోమవారం సంచలనం సృష్టించిన బాలుడి కిడ్నాప్ ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ పాఠశాలలో పీఈటీయే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే ఈ కిడ్నాప్‌కు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఈనెల 10న తుని ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్న ఒకటో తరగతి విద్యార్థి కిడ్నాప్ కలకలం రేపింది. సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో పోలీసులకు దొరికిపోతామన్న భయంతో కిడ్నాపర్లు వెనుకంజ వేశారు. బాలుడిని ఆటోలో ఇంటికి పంపించేస్తున్నట్లు తండ్రికి ఫోన్‌చేసి చెప్పారు. దీంతో ఆ బాలుడు తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా చేరాడు. అనంతరం కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో బాలుడి కిడ్నాప్‌కు పాల్పడ్డ ముగ్గురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. వీరినుంచి ఒక కారు, ద్విచక్రవాహనంతో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనపరుచుకున్నారు. తుని డీఎస్పీ శ్రీహరిరాజు కేసు వివరాలను వెల్లడించారు. తునిలోని ఓ పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ ఉపాధ్యాయుడు ఎం.రాజీవ్‌తో కలిసి రౌతులపూడి మండలం లచ్చిరెడ్డి గ్రామానికి చెందిన చందవాడ కాశీవుడు, ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన సురకాసుల రాముడు పథకం ప్రకారమే బాలుడ్ని కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. ఈజీగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో ఈ పనికి పాల్పడ్డారని, నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచనున్నామని చెప్పారు. సమావేశంలో తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ, ఎస్ఐ విజయ్‌బాబు, తుని పీఎస్ ఏఎస్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

రామ్ పోతినేని సినిమా షూటింగ్

- కొవ్వూరులో చిత్రీకరణ



కొవ్వూరు లాంచీలరేవు వద్ద రావురమేష్‌పై సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మైత్రి మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న హీరో రామ్ పోతినేని సినిమా చిత్రీకరణ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో బుధవారం జరిగింది. కొవ్వూరు పట్టణంలోని లాంచీలరేవు వద్ద గోదావరి ఏటిగట్టు రోడ్‌పై రావు రమేష్ సైకిల్‌పై తన కొడుకును ఎక్కించుకుని వెళ్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా రామ్ పోతినేని, హీరోయిన్‌గా మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే, ప్రధాన తారాగణం రావు రమేష్, బ్రహ్మానందం, హర్షవర్ధన్ నటిస్తున్నారు. సంగీతం వివేక్ మార్విన్ అందజేస్తున్నారు. మరో 40రోజులపాటు గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరుగుతుందని దర్శకుడు మహేష్‌బాబు, ప్రొడక్షన్ డిపార్ట్‌మెంటు సభ్యులు తెలిపారు. సినిమా షూటింగ్ కారణంగా రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు మీదుగా ఏలూరు వైపు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

పీడీఎఫ్, యూటీఎఫ్‌లపై హర్షకుమార్ వ్యాఖ్యలు సరికాదు

- అభ్యర్థులందరి సమక్షంలోనే రాఘవులు నామినేషన్ ఆమోదం
- ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐవీ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పీడీఎఫ్, యుటీఎఫ్‌లను విమర్శిస్తూ మాజీ ఎంపీ హర్షకుమార్ వ్యాఖ్యలు చేయడం సరికాదని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) ఖండించారు. కాకినాడలోని యుటీఎఫ్ హోంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐవీ మాట్లాడుతూ పీడీఎఫ్ ఎల్లప్పుడూ ప్రజాపక్షమేనన్నారు. పీడీఎఫ్, యూటీఎఫ్ అధికార కూటమికి అమ్ముడుపోయాయని ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ఆయన స్థాయికి తగదన్నారు. నామినేషన్ ప్రక్రియ ఎన్నికల నిబంధనల ప్రకారమే జరిగిందని, ఇతర అభ్యర్థుల సమక్షంలోనే డీవీ రాఘవులు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆమోదించారని తెలిపారు. పీడీఎఫ్ కులపరమైన అభ్యర్థుల ఎంపిక గానీ, కులపరంగా ఓట్లు అభ్యర్థించడంగానీ చేయదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల్లో పీడీఎఫ్ ప్రచారం చేస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాల ఉద్యమాల్లో రాఘవులు భాగస్వాములు అయ్యారన్నారు. హర్షకుమార్ తన అభ్యర్థి గుణగణాలు, అర్హతలు ప్రజలకు చెప్పి ఓట్లు అడిగితే బాగుంటుందన్నారు. పీడీఎఫ్ అభ్యర్థిపై హర్షకుమార్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఐవీ హితవు పలికారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో రాజకీయం

- సామాజికవర్గ ఓట్లు చీల్చేందుకు ప్రయత్నం
- మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేసిన నామినేషన్ల ప్రక్రియలో భారీ రాజకీయం జరిగిందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ల స్క్రూట్నీ పద్ధతిలో తొలుత పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవరావు డిస్ క్వాలిఫై అయ్యారని ప్రకటించారని, చివరిలో క్వాలిఫై అయినట్లు లిస్ట్‌లో ప్రకటించారని తెలిపారు. పీడీఎఫ్ అభ్యర్థి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారని తాను కూడా స్వాగతించానని, డిస్ క్వాలిఫై చేసి మళ్లీ క్వాలిఫై చేయడాన్ని బట్టి కుమ్మక్కైనట్లుగా అర్థమవుతోందన్నారు. ఇదంతా పోటీలో ఉన్న తన కుమారుడు జీవీ సుందర్‌కి, వీరరాఘవరావుకు మధ్య ఓట్లు చీల్చడం కోసమే చేశారని ఆరోపించారు.

'వ్యవస్థలతో కుటిల రాజకీయాలు'

తుని రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని కూటమి ప్రభుత్వం కుటిల రాజకీయాలు చేస్తోందని మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపించారు. తునిపట్టణంతోపాటు గ్రామీణప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్‌తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను, పట్టభద్రులను కలిసి మేనిఫెస్టో వివరించారు. అనంతరం తునిలో మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ల సందర్భంగా జరిగిన విషయాన్ని వివరించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా సుందర్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దారా సురేష్, తంతటి కిరణ్‌కుమార్, దళిత నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలిగా సునీత

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలిగా కె.సునీత నియమితులయ్యారు. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ, ప్రిన్సిపల్ సెక్రటరీగా ఈమె పనిచేస్తున్నారు. మరో రెండురోజుల్లో ఈమె కాకినాడ జిల్లాకు రానున్నారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించనున్నారు.

సత్యసూర్య బ్యాంకర్స్‌వద్ద ఖాతాదారుల గగ్గోలు



ఆందోళన చేస్తున్న బాధిత ఖాతాదారులు

కొత్తపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు హేమంత్ కార్యకలాపాలు నిర్వహించకుండా పరారైన నేపథ్యంలో అక్కడ బంగారం తాకట్టు పెట్టిన బాధితులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. తమ బంగారం తమకు ఇప్పించాలంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నిర్వాహకుడు హేమంత్ కుటుంబసభ్యులతో సహా పరారై పదిరోజులైందని, తమకు సమాధానం చెప్పాలంటూ లైసెన్సుదారుడైన శ్రీపూకోళ్లపు రామకృష్ణను, అతని తండ్రి సత్యనారాయణను నిలదీశారు. బాధితులందరికీ తగిన న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన మెర్లపాలెం విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలంలోని మెర్లపాలెం జడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఈతకోట జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలో మెర్లపాలెం విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఆరుగురు ఎంపికయ్యారు. అండర్-19 జూనియర్ బాలుర విభాగంలో ముగ్గురు విద్యార్థులు, జూనియర్ బాలికల విభాగంలో నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ శ్రీకాంత్ తెలిపారు. వీరిని సర్పంచ్ మెర్ల రాము, హెచ్ఎం శ్రీహరి, చైర్మన్ లక్ష్మినారాయణ అభినందించారు.

అనుమతులు లేని 8 ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొత్తపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట శివారు కపిలేశ్వరపురం మండలం కేదార్లంక ఇసుక రీచ్ నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు మైన్స్ ఆర్ఐ సుజాత తన సిబ్బందితో వెళ్లి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా తరలిపోతున్న 8 ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసి కొత్తపేట పోలీసులకు అప్పగించారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం నెల్లూరుకు చెందిన బాలకృష్ణారెడ్డి-శైలజ దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాత దంపతులను ఆయన అభినందించి స్వామివారి ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



వై.సుభ శ్రీవల్లి ఆత్రేయి



పి.ఆదిత్య అభిషేక్

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ 2025 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరచి అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించినట్లు చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. వై.సుభ శ్రీవల్లీ ఆత్రేయి, పి.ఆదిత్య అభిషేక్ 99.97 పర్సంటైల్ సాధించారని, జీఎస్ఆర్ శశాంక్ 99.96, టి.సాత్విక్, జి.ఇనేష్ 99.94 పర్సంటైల్‌ను సాధించారని, వీరితోపాటు మరో 47మంది ఆదిత్య విద్యార్థులు 99.00 పైన పర్సంటైల్ పొందారని తెలిపారు. వై.వెజిత్ 99.93, వైపీవీఎస్ చక్రపవన్ 99.92, ఎంజే చంద్ర, కేపీసాయి, జి.లోసిని 99.91 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచి అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వివాహ వేడుకకు వచ్చిన ఓ మహిళ విగతజీవిగా ఇంటికి చేరింది. బొమ్మూరు సీఐ కాశీ విశ్వనాథం తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన బీమడోలు మనోహర్ తన భార్య దయామణి(45)తో కలిసి స్థానికంగా ఏవీ అప్పారావు రోడ్డులో బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చారు. సాయంత్రం 5గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. తాడితోట గోకుల్ టీవీఎస్ వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు ముందు టైరు ఎక్కేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'లోవ'లో హుండీ లెక్కింపు

- రూ.39.31లక్షల ఆదాయం



తలుపులమ్మ లోవ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

తుని రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో హుండీలు లెక్కింపు బుధవారం నిర్వహించారు.కాకినాడ గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణ అధికారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో హుండీలు తెరిచి లెక్కించగా 66రోజులకుగాను రూ.39.91లక్షలు నగదుతో పాటు రూ.30.121 గ్రాముల బంగారం, 1.355 కిలోల వెండి ఆలయానికి సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది పాల్గొనగా దేవదాయశాఖ తనిఖీదారులు బి.ఫణీంద్ర కుమార్‌తో కలిసి ఆలయ ఈవో విశ్వనాథరాజు పర్యవేక్షించారు.

డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాలకోసం కాటన్ బ్యారేజినుంచి డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కుల నీరు విడుదలచేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 2650 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 1800క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4400 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. నదిలో నీటిలభ్యత 8309క్యూసెక్కులుండగా నీటి మట్టం 9.60 అడుగులుగా నమోదైంది.

బి.ప్రత్తిపాడులో 30క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్‌బియ్యం నిల్వలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పిఠాపురంరూరల్,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో రేషన్‌బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో బుధవారంరాత్రి పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్ తనిఖీలు నిర్వహించారు. రేకులషెడ్డులో నిల్వఉన్న 30క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆకుల గంగరాజుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

విద్యార్థినులకు అవగాహన

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సేఫ్ టచ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లపై పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్. ప్రకాష్, విద్యాకమిటీ ఛైర్మన్ సీహెచ్. ఆంజనేయులు, వైస్ ఛైర్మన్ బి.శ్రీను తదితరులున్నారు.

కాకినాడ అభివృద్ధికి కేంద్ర సహకారం కోరా

రాజ్యసభ ఎంపీ సతీష్‌బాబు



కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రాంత అభివృద్ధికి కేంద్రం సహకారాన్ని కోరానని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు వెల్లడించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకినాడ ప్రాంతానికి ఎకనమికల్ హబ్, ట్రేడ్ హబ్‌గా ఎదిగే సామర్థ్యం ఉందని తెలియజేయడం జరిగిందన్నారు. సుదీర్ఘ చరిత్రగల కాకినాడ పోర్టులో నౌకా నిర్మాణ పరిశ్రమకు సానుకూల అవకాశాలు ఉన్నాయని వివరించానన్నారు. కాకినాడ- అన్నవరం మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవేను నిర్మించాలని, ఉప్పాడ వద్ద సముద్రపు కోత నివారణకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా రూ. 200 కోట్లతో కోస్టల్ ప్రొటెక్షన్ ప్రాజెక్టును చేపట్టాలని, కాకినాడ పోర్టును ఎన్‌హెచ్ 216కు అనుసంధానం చేస్తూ రూ.235 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును తేవాలని కోరానన్నారు. ఉప్పాడ జాంధారి చీరల పరిశ్రమ ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని టెక్స్‌టైల్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు, కాకినాడ రైల్వే స్టేషన్ ఆధునీకరణపై దృష్టి సారించాలని కేంద్రాన్ని కోరడం జరిగిందని రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు తెలిపారు.

మర్లావ, జె.తిమ్మాపురంలో అగ్ని ప్రమాదాలు

రూ. 5 లక్షల నగదు, 7 కాసుల బంగారపు ఆభరణాలు బుగ్గిపాలు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

సామర్లకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం మర్లావ, జె.తిమ్మాపురంలో రెండు వేర్వేరు ప్రాంతాలలో బుధవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదాల్లో మూడు తాటాకిళ్లు దగ్ధం కాగా రూ.5 లక్షల నగదు, 7 కాసుల బంగారపు ఆభరణాలు బుగ్గిపాలయ్యాయి. మర్లావలో కోన సత్యకాంతానికి చెందిన తాటాకిల్లు ప్రమాదవశాత్తూ మంటల్లో చిక్కుకుంది. కుటుంబంలో త్వరలో జరుగనున్న ఒక విందు కార్యక్రమానికి ఖర్చు చేసేందుకు దాచి ఉంచిన రూ.1.5 లక్షల నగదు, 2 కాసుల బంగారపు అభరణాలు బుగ్గి పాలయ్యాయని బాధితులు బండి చక్రవేణి, సత్యకాంతం వాపోయారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పెద్దాపురం అగ్నిమాపకశాఖ సిబ్బంది మర్లావ చేరుకుని మంటలను ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. మర్లావ వీఆర్వో నష్టానికి చెంది నివేదికలను తహశీల్దార్ చర్యల నిమిత్తం రూపొందించి అందజేశారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి నష్టం అంచనాలు రూపొందిస్తున్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జె.తిమ్మాపురం గ్రామ శివారున జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు పూర్తిగా ఆహుత య్యాయి. సిమ్మా వీరకృష్ణకు చెందిన ఇంటిలో దాచి ఉంచిన రూ.3.5లక్షల నగదు, 5 కాసుల బంగారపు ఆభరణాలు బుగ్గిపాలయ్యాయి. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా తిమ్మాపురం వీఆర్వో సంఘటనా స్థలికి చేరుకుని నష్టానికి గల అంచనాలు రూపొందించి తహశీల్దార్‌కు అందజేశారు. ఈ అగ్నిప్రమాదాల పట్ల పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున బాధితులకు సాయం అందేందుకు కృషి చేస్తామన్నారు.

'సాగునీటి ఎద్దడి నివారణా చర్యలపై దృష్టి'



వేములవాడలో నీటి ఎద్దడి ఉన్న పొలాలను పరిశీలిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

కరప, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి ఎద్దడి నివారణా చర్యలపై దృష్టిసారించి రైతుల ఇబ్బందులను తొలగిస్తామని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎన్.విజయకుమార్ స్పష్టం చేశారు. కరప మండలం వేములవాడ, పెద్దాపురప్పాడు గ్రామాల్లో బుధవారం ఇరిగేషన్, వ్యవసాయశాఖాధికారులతో కలిసి ఆయన పర్యటించారు. సాగునీటి ఎద్దడి ఉన్న పొలాలను పరిశీలించి నష్ట నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వేములవాడలో తుల్యభాగనదిపై ఉన్న ఎత్తిపోతల పథకం ద్వారా లంక ప్రాంతానికి నీటిఎద్దడి లేకుండా అదనపు మోటర్లు ఏర్పాటుచేయాలని సూచించారు. వంతులవారీ విధానం అమల్లో భాగంగా నీటిని పెంచి పంపిణీ చేయాలని, అప్పుడు పెద్దాపురప్పాడుకు సాగునీటి ఎద్దడి రాకుండా ఉంటుందని ఇరిగేషన్ జేఈ భవానీకి సూచించారు. రైతులు ఆందోళన చెందవద్దని ఇరిగేషన్, వ్యవసాయశాఖలు సమన్వయంతో పనిచేసి సాగునీటిని పూర్తిస్థాయిలో అందజేస్తామని హామీ ఇచ్చారు. కరప సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, మండల వ్యవసాయాధికారి అప్పసాని వెంకటరాజేష్, విస్తరణాధికారి ప్రశాంత్, వీఏఏ సతీష్ పాల్గొన్నారు.

'ఎస్సీ కార్పొరేషన్ అసోసియేషన్' క్యాలెండర్ ఆవిష్కరణ



అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ క్యాలెండర్‌ను రాష్ట్ర మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దపాటి విజయ్‌కుమార్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి ఆవిష్కరించారు. ఈ మేరకు బుధవారం తాడేపల్లిలో ఇద్దరు ఛైర్మన్లను వారి కార్యాలయాల్లో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను నాయకులు తెలియజేసి ఛైర్మన్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు రఘుబాబు, కార్యదర్శి ఆర్ దుర్గాప్రసాద్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'విశిష్ట గుర్తింపు సంఖ్యతో బహుళ ప్రయోజనాలు'

పిఠాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమం ద్వారా బహుళ ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి తెలిపారు. ఈ గుర్తింపు సంఖ్య జారీ కోసం వ్యవసాయశాఖ పిఠాపురం సబ్ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా జరుగుతున్న రైతుల వివరాల నమోదు ప్రక్రియను ఆమె బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందేందుకు ఈ సంఖ్య కీలకంకానున్నదని తెలిపారు. రైతులు తమ వివరాలు నమోదు కోసం, ఆధార్ నెంబర్, దానికి లింకైన ఫోన్ నెంబరు, భూమి రికార్డులు తీసుకుని రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలవాలని ఆమె సూచించారు.

ఎమ్మెల్యే నానాజీని కలిసిన విశ్వేశ్వరరావు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గొడారిగుంటలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాద పూర్వకంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.విశ్వేశ్వరరావు కలిశారు. పార్టీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో కూటమి తరపున భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు చోడిశెట్టి రమేష్ ఉన్నారు.



ఎమ్మెల్యే పంతం నానాజీని సత్కరిస్తున్న విశ్వేశ్వరరావు

శివాలయ శిఖరంపై చంద్ర దర్శనం



గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం శిఖరంపై చంద్ర దర్శనం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆలయ శిఖరంపై చంద్ర దర్శనమయింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం శిఖరంపై, ధ్వజస్తంభంపై చంద్రుడు భక్తులకు దర్శనమిచ్చాడు. శిఖర సిగలో చంద్రుడు అలంకరించిన మాదిరిగా దర్శనం ఇవ్వడంతో భక్తులు భక్తతన్మయత్వంలో మునిగారు. ఏటా మాఘ పౌర్ణమి పర్వదినాల్లో చంద్ర దర్శనమవుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

వైసీపీ నగర అధ్యక్షురాలిగా సుంకర శివప్రసన్న

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ కాకినాడ నగర అధ్యక్షురాలిగా మాజీ మేయర్ సుంకర శివప్రసన్న నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం నియామకాన్ని ప్రకటించింది. 2022 నుంచి ఆమె వైసీపీ నగర అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. మూడోసారి కొనసాగిస్తూ అధిష్ఠానం ఆదేశాలిచ్చింది.

పేరాబత్తులకు ఓటు వేసి గెలిపించండి

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా కూటమి నాయకుల ఎన్నికల ప్రచారం



గొల్లప్రోలులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణ, వర్మ

గొల్లప్రోలు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అనకాపల్లి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందు సత్యనారాయణ, ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. గొల్లప్రోలులోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కళాశాలలు, వార్డు సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కూటమి అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ప్రచారంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగరపంచాయతీ మాజీ ఛైర్‌పర్సన్ శీరం మాణిక్యం, నాయకులు కడారి బాబ్జి, బస్సా సత్యనారాయణ దువ్వా తాతాజీ, కౌన్సిలర్ గుళ్ల సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి: పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మూలపేటలో ప్రచారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. ప్రచారంలో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే, పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పీలా గోవిందు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాపు సద్భావన సమితి నాయకులు మాజీ ఎంపీపీ వీవై దాసు, పీబీసీ డీసీ-2 ఛైర్మన్ అనిశెట్టి సత్యానందరెడ్డి ఉన్నారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, పీబీసీ డీసీ1 ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో యండపల్లిలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పట్టభద్రులు, ఉద్యోగస్తులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌కు వేయాలని కోరారు.



కాకినాడ సిటీ: గొల్లల మామిడాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పట్టభద్రుల ఓటర్లను కోరారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, టీడీపీ ఎన్నికల పరిశీలకుడు మోకా ఆనందసాగర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సామర్లకోట/పెద్దాపురం: పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోరుతూ పెద్దాపురంలో పలు కూడలి ప్రాంతాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు బొక్క వెంకటరమణ, సాయికృష్ణ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహ్మద్ అరిఫ్ ఆలీ, అనివిలా శాస్త్రి, బొద్దు ఉదయ్, విరోధుల రాజు, నారాయణ మూర్తి, డీఎస్ఆర్ శాస్త్రి, రామారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కరప: కూటమి నాయకులు సమష్టిగా పనిచేసి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఘనవిజయాన్నందించాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కాకినాడరూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు కోరారు. కరప మండలం వేళంగి, కరప, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు, కూరాడ, సిరిపురం, జి.బావారం, యండమూరు, విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, కొంగోడు, గొర్రిపూడి, పాతర్లగడ్డ, పెనుగుదురు, నడకుదురు గ్రామాల్లో వారు విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు చుండ్రు వెంకన్న రాయచౌదరి, బుంగా సింహాద్రి, వెలుగుల లచ్చారావు, మేడిశెట్టి పట్టాభి, పలివెల జానకిరామయ్య, పంపన కన్నారావు తదితరులున్నారు.

ఘనంగా మాఘ పౌర్ణమి పూజలు



సామర్లకోట భీమేశ్వరాలయంలో స్వామికి అలంకరణ



గొల్లప్రోలు మండలం దుర్గాడలో లలితాదేవికి అభిషేకం దృశ్యం

సామర్లకోట ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆలయ ఈవో బళ్ళ నీలకం ఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్ఛారణల మధ్య విశేష అభిషేక పూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చనపూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి, అమ్మవార్ల దర్శనం అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక మెహెర్ కాంప్లెక్స్ సమీపాన మహాలక్ష్మీగణపతి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సామర్లకోట కంచి కా మకోటి మహాసంస్థానం ఆవరణలో కంచి జగ ద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబీ కులు చంద్రాభట్ల పతంజలిపద్మ దంపతుల ఆధ్వర్యంలో పండితులు స్వామివారి విగ్రహానికి పంచద్రవ్య ములతో అభిషేకించారు. నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. సామర్లకోట గోదా వరి ఒడ్డున ఉన్న పురాతన మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు చక్రవర్తుల రఘు ఆధ్వర్యంలో మాండవ్యనారా యణ స్వామికి విశేష అభిషేక పూజలు, పుష్పార్చన పూజలు.. మహాలక్ష్మి అమ్మవారికి విశేష సింధూరార్చన పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను సూర్యవాహనంపై అలంకరించి పురవీధులమీదుగా గ్రామోత్సవం జరిపించారు.

దుర్గాడ శివాలయంలో...

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కొలువయి ఉన్న లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు జరిపి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీసూక్త, దుర్గా సూక్త సహస్ర నామపారాయణ చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. తాటిపర్తిలో అపర్ణాదేవిని పుష్పాలతో అలంకరించారు. పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆకొండి ప్రభా కరశాస్త్రి అపర్ణాదేవికి పంచహారతులు ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఉచిత ప్రసాదాలు అందజేశారు.

యండమూరులో వేడుకగా చక్రస్నానం

కరప, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యండమూరులో కొలువైన సామ్రాజ్యలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు స్వామివారి చక్రస్నానం వేడుకగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామం ఆధ్వర్యంలో గ్రామస్తుల సమక్షంలో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మీసాల వెంకన్నను కనులారా వీక్షించి పూజాధికాలు చేశారు.

వేట్లపాలెంలో..

సామర్లకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలు సందర్భంగా సామర్లకోట మండలం వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను గజవాహనంపై అలంకరించి గ్రామోత్సవసేవ నిర్వహించారు. అంతకు ముందు చక్రస్నానం- పూర్ణాహుతి పూజలను నిర్వహించారు. పూజల్లో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నున్న రామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు, పారిశ్రామికవేత్తలు నున్న నారాయణ రావు, గుమ్మళ్ళ సత్యనారాయణ, గుమ్మళ్ళ రాయన్న, గోలి రవిబాబు, గోలి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హోంగార్డులకు చేయూత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ అయిన హోంగార్డులకు చేయూతగా డిప్యూటేషన్‌లో ఉన్న హోంగార్డులు సమకూర్చిన ఒక రోజు వేతనాన్ని ఎస్పీ జి.బిందుమాధవ్ బుధవారం చెక్కు రూపంలో అందజేశారు. గతేడాది ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌జి వై.విజయకుమార్‌కు రూ. 1,93,830 చెక్కును ఎస్పీ అందజేశారు. గతేడాది జూన్‌లో చనిపోయిన ఎంవిజి కృష్ణ భార్య కుసుమకు హోంగార్డుల ఒక రోజు వేతనమైన రూ.4,53,690 చెక్కును అందజేశారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ కమిషనర్ భావన బుధవారం కాకినాడ మెయిన్‌రోడ్డులో టౌన్‌హాల్, రామాలయం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వాహణ తనిఖీ చేశారు. రోడ్లు, డ్రైయిన్ల పరిశుభ్రత, చెత్త సేకరణ ఎలా జరుగుతోంది వంటి విషయాలపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

రీసర్వేలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు

కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

పిఠాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో నిర్లక్ష్యంగా ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు హెచ్చరించారు. పిఠాపురం తహశీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల తహశీల్దార్లు, సర్వే, రెవెన్యూ సిబ్బందితో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. గతంలో జరిగిన భూమల రీసర్వేపై పలు అభ్యంతరాలు వస్తున్నాయని తెలిపారు. ఈసారి చేపట్టిన మలి విడత రీసర్వేలో ఎటువంటి పొరపాట్లుకు తావివ్వద్దని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతుల సమక్షంలోనే సర్వే చేపట్టాలన్నారు. గతంలో నిర్వహించిన రీసర్వే, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు, పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతుల పరిష్కారాలపై సమీక్షించారు. సమావేశంలో పిఠాపురం, గొల్లప్రోలు తహశీల్దార్లు వీవీ గోపాలకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తాం'

సామర్లకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఫిల్టర్ వాటర్ స్కీం ప్రధాన పైప్‌లైన్‌కు ఏర్పడిన సాంకేతిక అవరోధాలను పూర్తిస్థాయిలో మరమ్మతులు గురువారం నాటికి పూర్తి కావొచ్చని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య పేర్కొన్నారు. ఫిల్టర్ వాటర్ స్కీం వద్ద పనులను బుధవారం పర్యవేక్షించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఉండూరు రోడ్డులో ప్రధాన పైప్‌లైన్ నుంచి భారీ ఎత్తున లీకులు కావడాన్ని సకాలంలో గుర్తించి నిరోధించామన్నారు. ఫిల్టర్ వాటర్ స్కీం వద్ద రాబార్ తదితర పంపింగ్ వ్యవస్థలో చిన్న చిన్న మరమ్మతులను గుర్తించి చర్యలు చేపట్టామన్నారు. గోదావరి జలాలను వేసవి జలాశయంలోకి మళ్లించే ప్రధాన కాలువలో పూడిక అవరోధాలు ఇప్పటికే తొలగించినందున ఆశించిన రీతిలో గోదావరి జలాలు జలాశయంలోకి చేరుతున్నట్టు చెప్పారు. శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో రోజుకు 7.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఫిల్టర్‌వాటర్‌ను కుళాయిల ద్వారా సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో సత్తాచాటిన యాసిన్



బంగారు పతకం సాధించిన యాసిన్

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ క్రీడాప్రాధికారసంస్థ ప్రాంగణంలో శిక్షణ పొందుతున్న యాసిన్ జిమ్నాస్టిక్స్ ట్రాంపలేన్ విభాగంలో బంగారు పతకం సాధించిందని డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఈనెల 8నుంచి 13వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన 38వ జాతీయస్థాయి క్రీడాపోటీల్లో యాసిన్ ప్రతిభ చాటిందన్నారు. విజయవాడకు చెందిన యాసిన్ 2019 నుంచి కాకినాడ జిమ్నాస్టిక్స్ ఆడిటోరియంలో శిక్షణ పొందుతూ పతకాలు సాధించిందని శిక్షకుడు సురేష్ తెలిపారు. 2022లో జరిగిన 36వ జాతీయక్రీడల్లో రజతం, 2023 జనవరిలో నేషనల్ సీనియర్స్ జిమ్నాస్టిక్‌సలో బంగారు, 2024 ఫిబ్రవరిలో కాంస్య పతకాలు సాధించినట్టు తెలిపారు. ఐడియల్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసిన యాసిన్ కాకినాడలో నివాసముంటూ శిక్షణ పొందుతుందన్నారు.

నాగబాబుకు ఎమ్మెల్యే రాజప్ప అభినందన



సామర్లకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో సామర్లకోటకు చెందిన వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగి వై.నాగబాబు పలు పతకాలు సాధించడంతో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అభినందించారు. ఈ మేరకు నాగబాబు బుధవారం రాజప్ప స్వగృహంఅయిన అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు.

గొల్లప్రోలులో ఏఎస్పీ తనిఖీ



గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్

గొల్లప్రోలు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌ను కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి కేసుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యాలపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఏ సమాచారాన్ని అయినా తెలియజేసేందుకు స్థానిక పోలీసులతో పాటు తన ఫోన్ నెంబరు 9440796505 అందుబాటులో ఉంటుందని తెలిపారు. గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో సిబ్బంది కొరతను ఎస్పీ దృష్టిలో పెట్టినట్లు చెప్పారు. తనిఖీల్లో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

పిఠాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుబాటులోకి వచ్చింది. దేవదాయశాఖ ఆధ్వర్యంలోని సంస్థాన సత్రం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సమకూరుస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, సీపీడీసీ సభ్యులు కొండేపూడి శంకరరావు, ప్రభు ప్రారంభించారు. దూరప్రాంతాల నుంచి వస్తున్న కళాశాల విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించడంతో వారికి సౌకర్యంగా ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. సంస్థానసత్రం ఈవో నున్న శ్రీరాములు, అధ్యాపకులున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 3 పోలింగ్ కేంద్రాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు కొత్తపల్లిలో 3 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ జి.చిన్నారావు తెలిపారు. కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయంలో 1, ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 2 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం ప్రధాన విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో రామవరం-పిఠాపురం, పెద్దాపురం- పాయకరావుపేట విద్యుత్ లైన్లు మార్పులలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పెద్దాపురం విద్యుత్ ఈఈ ఏవీఎస్ఎస్. ప్రభాకర్, కాకినాడ ఈఈ ఖాజా రహంతుల్లా బుధవారం సాయంత్రం వెల్లడించారు. వడ్లమూరు, రాగంపేట, కట్టమూరు, కట్టమూరు వ్యవసాయవసర ఫీడర్లతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కటకంశెట్టి పరామర్శ



బాధితులకు భరోసా కల్పిస్తున్న కటకంశెట్టి

కరప, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కరపలో ఇటీవలె మృతిచెందిన కల్లుగీత కార్మికుడు పెంకే శ్రీనివాస్ కుటుంబాన్ని బుధవారం టీడీపీ కాకినాడరూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకటప్రభాకర్(బాబి) పరామర్శించారు. వారికి ఆర్థికసాయం అందజేసి శ్రీనివాస్ కుమార్తె బీటెక్ చదువుకు అయ్యే పూర్తి ఖర్చును భరిస్తానని ప్రకటించారు. రాష్ట్ర శెట్టి బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, కాకినాడ రూరల్ మాజీ జడ్పీటీసీ కాకరపల్లి చలపతిరావు, టీడీపీ నాయకులు గుడాల లోవరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించినవారిలో ఉన్నారు.

తోట రాంజీ పరామర్శ

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్య వారిపాలెంలో ఇటీవల మరణించిన గెడ్డం వీరభద్రరావు కుటుంబసభ్యులను వైసీపీ నాయకుడు తోట రాంజీ పరామర్శించారు. ఆయన వెంట మన్యవారిపాలెం సర్పంచ్ వీర్రాజు, వైసీపీ మండలం అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, గాది కృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించండి'

అడ్డతీగల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో అడ్డతీగల, వేటమామిడి, తిమ్మాపురం, గొంటువానిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో నియోజకవర్గ అబ్జర్వర్ డి.రత్నాకర్, చెల్లుబోయిన శ్రీనివాస్, మండల అధ్యక్షుడు జర్తా వెంకట రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్డి రాంబాబు, బీజేపీ మండల కన్వీనర్ స్వప్న కుమారి పాల్గొన్నారు.


రాజవొమ్మంగిలో ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

పేరాబత్తుల విజయం కోసం ప్రచారం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం కూటమి నాయకులు బుధవారం మండలంలో ప్రచారం జరిపారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు రాజవొమ్మంగి పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బూత్ ఇన్‌చార్జి ముప్పన కేశవ్, లోతా లక్ష్మణరావు, జనసేన ప్రధాన కార్యదర్శి పల్ల అప్పారావు, బూత్ ఇన్‌చార్జిలు బలభద్రపు రాజుబాబు, వెచ్చం లోవరాజు, చెక్కా లోవరాజు ఉన్నారు.

ఫిట్స్‌తో యువతి మృతి


మృతిచెందిన మడివి సలోని

మోతుగూడెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలో ఉన్న కొత్తపల్లిలో మడివి సలోని(18) అనే యువతి రంపచోడవరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యూ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమెకు అప్పుడప్పుడు ఫిట్స్ రావడంతో కాలేజీ నుంచి కొత్తపల్లికి వచ్చి తల్లిదండ్రుల వద్దకు మెరుగైన వైద్యం కోసం వచ్చింది. బుధవారం సీలేరు నది వద్ద దుస్తులు ఉతకడానికి వెళ్లింది. ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో నీటిలో పడిపోయింది. కూతురు రాలేదని తల్లి గంగమ్మ కంగారుపడుతూ కూతురు దగ్గరికి బయలుదేరింది. అక్కడకు వెళ్లేసరికి ఒడ్డున సీలేరు నదిలో సలోని పడి ఉంది. గ్రామస్తులు ఆటోలో చింతూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మరణించిందని వైద్యులు నిర్ధారించారు. మోతుగూడెం ఎస్‌ఐ శివ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిమాంసం విక్రయాలు నిలిపివేయాలి

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రబలిన దృష్ట్యా వ్యాపారులు కోడి మాంసం, గుడ్ల విక్రయాలను నిలిపివేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాల్లోని విద్యార్థులకు పెట్టొద్దని సూచించారు. విక్రయాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గత ప్రభుత్వం కేటాయించిన

పవర్ ప్లాంట్లు రద్దు చేయాలి

రంపచోడవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతాల్లో 1/70 చట్టానికి భిన్నంగా గత ప్రభుత్వం ఆయా సంస్థలకు కేటాయించిన పవర్ ప్లాంట్లను రద్దు చేయాలని, ఇటీవల చేసిన కొత్త కేటాయింపులను విరమించుకోవాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం ముఖ్యమంత్రి చంద్రబాబును కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పంపించిన వినతిపత్రాన్ని మీడియాకు విడుదల చేశారు. గత ప్రభుత్వంలో అల్లూరి, పార్వతీపురం మన్యంలో పంప్డ్ స్టోరేజ్ హైడల్ ప్రాజెక్టులు నాలుగింటిని అదానీ పవర్ కంపెనీకి, షిరిడిసాయి ఎలక్ట్రికల్స్‌కు కేటాయించారని, ఇది 1/70 చట్టం స్ఫూర్తికి భిన్నంగా ఉన్నదని లచ్చిరెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వ అక్రమ చర్యలన్నీ రద్దవుతాయని భావించామని, గిరిజన ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ ప్రాజెక్టులను రద్దు చేయకపోగా, ఇటీవల మంత్రి మండలి సమావేశంలో అల్లూరి మన్యంలో మరో రెండు ప్రాజెక్టులను నవయుగ కంపెనీకి కేటాయించడం సరికాదని అన్నారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ


చింతూరు ఏరియా ఆసుపత్రిలో వ్యాధిగ్రస్తులకు పాలు, పండ్లు పంచుతున్న జమాల్‌ఖాన్

చింతూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జేకే సీటీ ట్రస్ట్ చైర్మన్, ఆయుర్వేద నిపుణుడు జమాల్ ఖాన్ బుధవారం తన పుట్టిన రోజు సందర్భంగా చింతూరు ఏరియా ఆసుపత్రిలో వ్యాధిగ్రస్తులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ జమాల్‌ఖాన్ చింతూరు ఏరియా ఆసుపత్రికి రూ.60 వేలతో తాగునీటి వసతిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

దివ్యాంగుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

దేవీపట్నం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ, రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో దివ్యాంగులను గుర్తించేందుకు డోర్ టు డోర్ నిర్వహించామని పారా లీగల్ వలంటీర్ తెల్లం శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురిని గుర్తించామన్నారు. యూపీఐ సెషన్ వాక్సినేషన్‌లో పాల్గొన్నామన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్స్ కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, బి.చక్రి, ఏఎన్ఎం కారం సత్యవతి, డి.మంజులరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ఆర్.శ్రీను, అంగనవాడీ శారపు లక్ష్మికుమారి, ఆశావర్కర్ రత్నం, జయ పాల్గొన్నారు.

కింద్ర సచివాలయం తనిఖీ

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కింద్ర సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో యాదగిరీశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కొంత మంది సచివాలయం ఉద్యోగులు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా ఫీల్డ్‌కి వెళ్లడంపై పంచాయతీ సెక్రటరీని ప్రశ్నించి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ పరిశీలించి పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్ పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

మాఘపౌర్ణమి పూజలు

రేవుల్లో భక్తుల స్నానాలు

తొండంగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘపౌర్ణమి సందర్భంగా పెద్దఎత్తున భక్తులు బుధవారం పవిత్ర స్నానాలకు తరలిరావడంతో రేవులన్నీ భక్తులతో పోటెత్తాయి. మండలంలోని ఒంటిమామిడి, తాటియాకులపాలెం, దానవాయిపేట, అద్దరిపేట, పెరుమాళ్లపురం, వేమవరం, పంపాదిపేట తదితర రేవుల్లో తెల్లవారుజామునుంచే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పవిత్ర స్నానాలు ఆచరించారు. మండల గ్రామాల నుంచే కాకుండా ఏజెన్సీ, తుని పరిసర గ్రామాల నుంచి వివిధ వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. రేవులో స్నానాలు ఆచరించిన అనంతరం తీరంలో ఉన్న వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. తప్పెటగుళ్ల వాయిద్యాల మధ్య వివిధ గ్రామాలకు చెందిన తాడిపెద్దులను స్నానాలకు తీసుకువచ్చారు. జంగమ దేవరల శంఖనాధాలు, డమరక వాయిద్యాల నడుమ తమ పూర్వీకులకు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో వాహనాలు రావడంతో తొండంగి-అన్నవరం రహదారిపై పూర్తి రద్దీ ఏర్పడింది. ఒంటిమామిడి రాజరాజేశ్వరి సహిత విశ్వేశ్వరుని త్రిశూల స్నానం ఆచరింపచేశారు. తాటియాకులపాలెం రేవులో మంగళవాయిద్యాల నడుమ పల్లకీలో స్వామి,అమ్మవార్లను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేసి త్రిశూలస్నానం ఆచరింపచేశారు.


తొండంగి: త్రిశూల స్నానం ఆచరింప చేస్తున్న దృశ్యం

రాచపల్లిలో...


ప్రత్తిపాడు: రాచపల్లిలో అపీత కుచాంబ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో అరుణాచలేశ్వర ఆలయంలో మాఘపౌర్ణమిని పురస్కరించుకుని విశిష్ట పూజలు నిర్వహించారు. అపీత కుంచాంబ అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. లలిత సహస్రనామ పారాయణం, మణిదీప వర్ణన, విష్ణుసహస్రనామ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రమణసేవాశ్రమ నిర్వాహకులు స్వామి రామానంద ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడికి తీవ్రగాయాలు

వన్యప్రాణుల వేటకు అమర్చిన విద్యుత్ కంచె తగిలి అస్వస్థత

ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి పొలాల్లో ఘటన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల కోసం వేటగాళ్లు పొలాల్లో అక్రమంగా అమర్చిన విద్యుత్ కంచెలు ప్రజల పాలిటశాపంగా మారాయి. రాత్రిపూట పొలాల్లో నీటి వినియోగం కోసం విద్యుత్ మోటార్ల వద్దకు వెళ్లే రైతులకు వేటగాళ్లు అమర్చే విద్యుత్ కంచెలకు బలవుతున్నారు. తాజాగా మండలంలోని ఒమ్మంగిలో సూర్నీడి త్రిమూర్తులు అనే యువకుడు ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ కంచెలకు చిక్కి తీవ్ర గాయాలపాలయ్యాడు. దేశెట్టి రాంబాబుతో కలిసి త్రిమూర్తులు ఒమ్మంగి గ్రామ శివారులోని సూరవరపు మెట్ట వద్ద ఉన్న పెద్దగెడ్డలో మోటారు నుంచి నీరు రావడంలేదని వెళ్తుండగా వేటగాళ్లు అమర్చిన విద్యుత్ కంచెకు కాలు తగిలి త్రిమూర్తులు తీవ్రంగా గాయపడ్డాడు. అతడు స్పృహతప్పగా ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. త్రిమూర్తులుకు కాళ్లు, పాదాలు, తొడ మీద, పొట్ట తీవ్రంగా కాలి గాయాలయ్యాయి. గతంలో అనేకసార్లు అడవి పందులు, ఇతర వన్యప్రాణుల కోసం ఒమ్మంగి సూరవరపు మెట్ట వద్ద వేటగాళ్లు విద్యుత్ కంచెలు అమర్చడంతో అనేకమంది ప్రమాదాల బారిన పడ్డారు. విద్యుత్, అటవీ శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో వన్యప్రాణుల వేటగాళ్ల ఆగడాలకు అంతులేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.


గాయపడిన యువకుడు


విద్యుత్ కంచె అమర్చేందుకు ఏర్పాటు చేసిన వైర్లు

ఇర్రిపాకకు శివకేశవుల విగ్రహాల తరలింపు


మురారిలో శివకేశవుల విగ్రహాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఏలేరు కాలువ సమీపంలో ప్రతిష్ఠించనున్న శివకేశవ, వెంకటేశ్వరస్వామి, నంది విగ్రహాలను రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరులో తయారుచేయించి తీసుకొచ్చారు. ఈ విగ్రహాలకు మురారిలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి హారతులు ఇచ్చి పూజలు చేశారు. అక్కడి నుంచి భక్తుల నడుమ భజన గీతాలు, వాయిద్యాల మధ్య బాణసంచా పేల్చుతూ మురారి, గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు మీదుగా ఇర్రిపాక తరలించారు. జగ్గంపేట సీఐ శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు ట్రాఫిక్ నియంత్రణ చేశారు.

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్లు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన యనమల


టీడీపీలో చేరిన కౌన్సిలర్లతో యనమల రామకృష్ణుడు

తుని రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తుని మున్సిపాల్టీకి చెందిన వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీపై అసంతృప్తి చెందిన 4, 23, 28 వార్డుల వైసీపీ కౌన్సిలర్లు కర్రి దేవి, చింతకాయల భారతి, తుమ్మలపల్లి సుశీల, తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. యనమల మాట్లాడుతూ అభివృద్ధిని ఆకాంక్షించే వారికి పార్టీలో ఎప్పుడూ తలుపులు తెరిచి ఉంటాయ న్నారు. వీరి చేరికను తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, మల్ల గణేష్, కుక్కడుపు బాలాజీ స్వాగతిస్తూ తుని పట్టణ అభివృద్ధికి టీడీపీతో కలిసి రావడం శుభపరిణామమన్నారు. కౌన్సిలర్లను టీడీపీ నాయకులు యనమల లక్ష్మణరావు, పరవాడ తాతబ్బాయి అభినందించారు.

కుర్చీల బహూకరణ


శంఖవరంలో హెచ్ఎంకు కుర్చీలను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

శంఖవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తాము చదివిన పాఠశాలకు ఎంతో కొంత మేలు చేయాలనే ఉద్దేశంతో పూర్వపు విద్యార్థులంతా కలిసి కుర్చీలను బహూకరించారు. శంఖవరం ఉన్నత పాఠశాలలో 2014-15 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థులు పాఠశాలకు 20 కుర్చీలను బహూకరించారు. ప్రధానోపాధ్యాయులకు వీటిని అందజేశారు.

ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకుడు మెట్ల రమణబాబు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, గురుకుల పాఠశాలలో ఉన్న పట్టభద్రులను బుధవారం కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజశేఖర్‌ను గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, జ్యోతుల పెదబాబు, బస్సా ప్రసాద్, మైరాల కనకారావు, బుగతా శ్రీనివాస్, నూకతాటి ఈశ్వరుడు, జిగటాపు సూరిబాబు, సామంతుల గోపి, కోరాడ కృష్ణమోహన్ పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పట్టభద్రులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

మూలకు చేరిన 'స్వచ్ఛ రిక్షాలు'

రౌతులపూడి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ఉపయోగించే స్వచ్ఛ సంకల్పం రిక్షాలు మూలకు చేరాయి. గత ప్రభుత్వంలో వీటిని పంచాయతీలకు కేటాయించగా కొద్దిరోజులు మాత్రమే ఉపయోగించారు. వీటి నాణ్యత నాసిరకంగా ఉండడం, తరచూ మరమ్మతులకు గురికాడంతో పక్కన పడేశారు. రౌతులపూడి మండలంలోని పంచాయతీల్లో ఈ రిక్షాలు కొన్ని పనిచేస్తుండగా మరికొన్ని ఇలా మూలనపడ్డాయి.


రౌతులపూడి మండలం గుమ్మరేగుల్లో పొలాల్లో మూలన ఉన్న స్వచ్ఛ సంకల్పం రిక్షా

ఖాతాదారులకు

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

ఎటపాక, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) తోటపల్లి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతాదారులకు బుధవారం గన్నవరం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. ఖాతాదారులు సైబర్ నేరాలకు గురైతే 1930 ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కందుకూరి స్వర్ణ, వెలుగు వీవోఏ పిడియాల బేబీ తదితరులు పాల్గొన్నారు.


కళాజాతలో ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

'గిరిజనులకు టీడీపీ ప్రభుత్వం అండ'



రంపచోడవరం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. 1/70 చట్టాన్ని సవరించే విధంగా కూటమి ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. జీవో నెం.3పై ముఖ్య మంత్రి చంద్రబాబు పరిశీలిస్తున్నారని, గిరిజన హక్కులు, చట్టాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు.

ఘనంగా స్వామి దయానంద సరస్వతి జయంతి

మోతుగూడెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం డీఏవీ పాఠశాలలో బుధవారం స్వామి దయానంద సరస్వతి పుట్టినరోజు వేడుకలు ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో జరిపారు. ముందుగా స్వామి దయానంద సరస్వతి చిత్రపటానికి విద్యార్థులు, తల్లిదండ్రులు పూలదండ వేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దయానంద సరస్వతి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో పౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యంగిర హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించారు. పారాయణలు, జపాలు చేశారు. 11గంటలకు పవిత్ర హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు తాగునీరందించడమే లక్ష్యం


కొత్తపల్లిలో బోర్ ప్రారంభిస్తున్న నాసా సభ్యులు

శంఖవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు తాగునీటిని సమృద్ధిగా అందించడమే లక్ష్యంగా నాసా సంస్థ పనిచేస్తున్నట్లు ఆ సంస్థ సభ్యులు తెలిపారు. కొత్తపల్లిలో వెల్ఫర్ లైఫ్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ఆ సంస్థ డైరెక్టరు మైకెల్ వైజర్ ప్రారంభించారు. న్యూలైఫ్ డైరెక్టర్ రాజా కులపతి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మరిన్ని బోర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల చిన్నమ్ములు, ఈగల దేవుళ్లు, బత్తన దావీదు, దొండపాటి రమేష్, నాసా సిబ్బంది దొంగ బాబు, హేమలత, వెంకటరత్నం పాల్గొన్నారు.

'ప్రగతి'లో వర్క్‌షాప్

గండేపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో డేటా ఫ్లో మాస్టీ రెట్రీవల్ అండ్ ఇన్‌సెప్షన్ బెస్ట్ ప్రాక్టీస్ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ ముగిసిందని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బ్రెయినోవిజన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అకాడమీ నుంచి శ్రీనారాయణస్వామి, డి.ఓబులయ్య, కె.కిరణ్ హాజరయ్యారు. వర్క్‌షాప్‌లో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ అకడమిక్స్ డాక్టర్ కె.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ జి.నరేష్, డాక్టర్ రాధాకృష్ణ, కోఆర్డినేటర్ ఎల్.యమున, జీవీ రాజేశ్వరి పాల్గొన్నారు.

రాజపూడి-మన్యంవారిపాలెం రోడ్డు పరిశీలించిన తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజపూడి నుంచి మన్యంవారి పాలెం వెళ్లే రోడ్డును జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ బుధవారం పరిశీలించారు. అధికారులు పట్టించుకోకపోవడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణితో పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, రాళ్లు లేచిపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆరోపించారు. పంచాయతీరాజ్ ఉన్నతాధికారులతో రమేష్ మాట్లాడారు. మండల స్థాయి అధికారులు దృష్టి సారించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. పరిశీలనలో గండికోట శ్రీను, మారోతి సూర్యచంద్రం, కానాటి శ్రీను, అప్పన్న, బొడ్డు అప్పలరాజు, మొగులు ఏసు పాల్గొన్నారు.


తుమ్మలపల్లి రమేష్‌తో రైతులు